సాక్షి
తిరుపతి

శనివారం । 13 । జూలై । 2024



దర్గాగా భూ ఆక్రమణ

చిన్నగొట్టిగల్లు మండలంలో టీడీపీ నేతలు ఓ రైతు భూమిని దౌర్జన్యంగా దున్నేయడం కలకలం రేపింది. - 8లో



ఫ్యాషన్ షో

పద్మావతి యూనివర్సిటీలో లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షో అలరించింది. అదిరే డ్రస్‌లతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. - 8లో



గరుడ వాహనంపై అభయం

శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

సాగునీటి ప్రాజెక్టులపై ఫోకస్



డీ.రామగోపాల్, చీఫ్ ఇంజినీర్

తిరుపతి అర్బన్: సాగు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్ పెడతామని జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ డీ.రామగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతిలోని తమ కార్యాలయం నుంచి మాట్లాడుతూ కర్నూలు హంద్రీ–నీవా ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తనకు రెండు రోజుల క్రితమే తిరుపతి జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను ఏ మేరకు సద్వినియోగం చేసుకోవడానికి వీలుంటుందో దానిపై కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. ప్రధానంగా తెలుగుగంగ నీటిని వంద శాతం సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామన్నారు. కండలేరు జలాశయంలో పూడిక తీత పనులపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

డిప్లొమా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

తిరుపతి ఎడ్యుకేషన్ : డిప్లొమా విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కౌటిల్య విద్యాసంస్థ సీనియర్ ఫ్యాకల్టీ ఎస్ఎస్. రెడ్డి తెలిపారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సెట్విన్ ఆధ్వర్యంలో 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా ఎస్ఎస్.రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, అలాగే ప్రైవేటు రంగ సంస్థల్లోనూ అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు అకడమిక్ చదువుతో పాటు అర్థమెటిక్, ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్‌లో ప్రావీణ్యం సాధించాలని, అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను అలవరచుకోవాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెంపొందించుకుంటే సులువుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చని తెలిపారు. సెట్విన్ మేనేజర్ కె.మోహన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, జనరల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



ప్రిన్సిపల్‌తో ఎంపికైన విద్యార్థినులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్స్ బ్రాంచ్–7 ఎలక్ట్రికల్–1, ఎలక్ట్రానిక్స్–3 మొత్తం 11మంది విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ప్రతి ఏటా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) పదో తరగతి ప్రతిభ ఆధారంగా మెరిట్ స్కాలర్‌షిప్‌నకు డిప్లొమో విద్యార్థినులను ఎంపిక చేస్తుంది. ఎంపికైన విద్యార్థినులకు ఏటా రూ.50 వేలు చొప్పున మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్‌ను అందిస్తుంది. ఈ స్కాలర్‌షిప్‌నకు జె.అక్షయ, కుంభకోణం సుప్రియ, నరాల వైష్ణవి, తరిగొండ హన్సిక, పాశెం కుందనశ్రీ, షేక్ గుత్తిపల్లి ఆస్మ, కె.వేణుశ్రీ, బైసాని భవ్యశ్రీ, కె.సాహితీ సంధ్య, తవ్వా లక్ష్మీ శ్రావ్యారెడ్డి, చందూరీ సాయి సంయుక్త ఎంపికయ్యారు. వారిని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, జనరల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఎల్రక్టానిక్స్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్స్ విభాగాధిపతులు అచ్యుత రామారావు, జి.బోస్ బాబు, గోపికృష్ణ తదితరులు అభినందించారు.

కుష్ఠు వ్యాధిపై ఇంటింటా సర్వే



సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: కుష్ఠు వ్యాధి నివారణకు ఇంటింటా సర్వే చేపట్టనున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం కుష్ఠు వ్యాధి పై ఇంటింటా సర్వే అంశానికి సంబంధించి వైద్యాధి కారులు, సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు సర్వే విధి విధానాలు, కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన, లక్షణాలను గుర్తించే విధానాలపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది పర్యటించనున్నట్లు చెప్పారు. కుష్ఠు, ఎయిడ్స్ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శరీరంలోని మచ్చలను అశ్రద్ధ చేయరాదన్నారు. దామియా ఎన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ కార్యదర్శి శివకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు పాల్గొన్నారు.

రెడ్ రీసెర్చ్!

ఎర్రచందనం ఉత్పత్తులపై పరిశోధనలు చేస్తున్న సిబ్బంది



తిరుపతి బయోట్రీమ్ వద్ద ఎర్రచందనం మొక్కల నర్సరీ





శేషాచల అడవుల్లో లభించే ఎర్రచందనానికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. దీన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని కేంద్రప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగానే తిరుపతిలో బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెడ్ శాండిల్స్ రీసెర్చ్‌గా మార్చింది. విస్తృత స్థాయిలో ప్రయోగాలు చేస్తూ దేశంలో ఎక్కడైనా.. ఏకాలంలోనైనా దృఢంగా.. ఏపుగా పెరిగేవిధంగా చర్యలు చేపడుతోంది. దీనికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఫలితంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

- ఎర్రచందనం మొక్కలపై విస్తృతంగా ప్రయోగాలు
- అన్ని కాలాల్లో పెరిగేలా సత్వర చర్యలు
- తిరుపతి బయోట్రీమ్ నుంచి దేశ వ్యాప్తంగా మొక్కల పంపిణీ
- రూ.10కోట్లతో పరిశోధన కేంద్రం పనులు ప్రారంభం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.5 కోట్లు విడుదల
- ఎర్రచందనం మొక్కల ఉత్పత్తికి చర్యలు చేపడుతున్న అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం: తూర్పు కనుమల్లో అంతర్భాగమైన ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం కొండల్లో అరుదుగా లభించే ఎర్రచందనంపై పరిశోధనలు చేయడానికి అడుగులు పడ్డాయి. అంతరించిపోతున్న వృక్షాల సైటిస్ (సీఐటీఎస్) జాబితాలో చేరిన ఎర్రచందనాన్ని కాపాడుకోవడానికి కేంద్ర స్థాయిలో ప్రయత్నాలు సాకారమవుతున్నాయి. ఎర్రచందనం వృక్షాలు దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో, అన్ని వాతావరణ పరిస్థితుల్లో వేగంగా, బలంగా పెరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనికి తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎర్రచందనం ప్రయోగశాల కేంద్ర బిందువుగా నిలుస్తోంది.

అప్‌గ్రేడ్ అవుతున్న బయోట్రీమ్

గతంలో ఎలాంటి పరిశోధనలు లేక బయోట్రీమ్ కార్యకలాపాలు దాదాపుగా ఆగిపోయాయి. శాస్త్రవేత్తలు, సిబ్బంది కూడా తరలిపోవడంతో, పరిశోధన కేంద్రం మూతపడింది. ఈ నేపథ్యంలోనే బయోట్రీమ్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర అటవీశాఖ నేతృత్వంలో పనిచేస్తున్న బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెడ్ శాండిల్స్ రీసెర్చ్‌గా మార్చేందుకు తీసుకున్న పనులు కార్యరూపం దాల్చాయి. మూడు దశాబ్దాలుగా టేకు, టిష్యూ కల్చర్ ప్రాజెక్టు కేంద్రంగా రైతాంగానికి ఉత్తమ టేకు మొక్కలను అందించిన బయోట్రీమ్ ఇకపై ఎర్రచందనం మొక్కల అభివృద్ధి కేంద్రంగా మారనుంది. ఇక్కడ ఎర్రచందనం మొక్కలను టిష్యూకల్చర్ పద్ధతిలో అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా అన్ని కాలమాన పరిస్థితులకు అనుకూలంగా పెరిగేలా ప్రయోగశాలలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రారంభించింది. పర్యావరణ, అటవీశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఆర్) పర్యవేక్షణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెడ్ శాండిల్స్ రీసెర్చ్‌గా బయో ట్రీమ్‌ను తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం అవసరమయ్యే అధునాతన ప్రయోగశాల ఏర్పాటుకు, శాస్త్రవేత్తల నియామకం, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటికే బయోట్రీమ్ అధికారులు రూ.10 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి, చెన్నైలోని నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీకి పంపించారు. ఇందులో నుంచి రూ.5 కోట్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసింది. ఈ సొమ్ముతో ప్రస్తుతం బయోట్రీమ్‌లో మౌలిక వసతులు, సదుపాయాల మెరుగు కోసం అధికారులు పనులను ప్రారంభించారు. ప్రస్తుతం బయోట్రీమ్‌లోని రోడ్లను పునర్నిర్మించడం, సిబ్బంది క్వార్టర్స్‌కు మరమ్మతులు వంటి పనులు చేశారు. అలానే నర్సరీలను ఎర్రచందనం మొక్కలు పెంపకానికి అనువుగా సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే కొన్ని మిషనరీలను కొనడానికి ఎంఎస్‌సీ ద్వారా టెండర్లు పిలవనున్నారు. రెండో దశలో టిష్యూకల్చర్ ద్వారా మొక్కలను అభివృద్ధి చేసేందుకు ల్యాబ్‌ను అభివృద్ధి చేసే పనులను చేపట్టారు.



తిరుపతిలో ఎర్రచందనం పరిశోధన కేంద్రం



ఎర్రచందనం ఉత్పత్తులపై పరిశోధనలు



నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఎర్రచందనం మొక్కలు

దేశ వ్యాప్తంగా ఎర్రచందనం పెంపునకు చర్యలు



శేషాచల కొండల్లో ఉన్న అరుదైన, ఖరీదైన ఎర్రచందనం అంతరించిపోకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం. తిరుపతి బయోట్రీమ్ కేంద్రంగా ఎర్రచందనం మొక్కల ఉత్పత్తిని పెంపొందించనున్నాం. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర అటవీశాఖ నేతృత్వంలో పనిచేస్తున్న బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెడ్ శాండిల్స్ రీసెర్చ్‌గా మార్చనున్నాం. దాంతో గతంలో బయోట్రీమ్‌లో ఉత్పత్తి చేసిన టేకు, టిష్యూకల్చర్ పద్ధతిలో ఎర్రచందనం ఉత్పత్తిని చేపడుతున్నాం. ఎర్రచందనం మొక్కలను దేశ వ్యాప్తంగా పెంచేలా కృషి చేస్తున్నాం. దాంతో పాటు పంట పొలాల వద్ద రైతులు ఎర్రచందనం మొక్కలను నాటుకోవచ్చు. అందుకు అవసరమైన అనుమతులను కూడా అటవీశాఖ ద్వారా ఇప్పిస్తాం. త్వరలోనే తిరుపతి బయోట్రీమ్ నుంచి ఎర్రచందనంతో పాటు అంతరించిపోతున్న మరిన్ని అరుదైన మొక్కల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం.

– యశోదాబాయ్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తిరుపతి బయోట్రీమ్

గురుకులంలో డెంగీ కలకలం

- పాఠశాలలో అడుగడుగునా నిర్లక్ష్యమే
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు





సరీనా ఆరోగ్యంపై ప్రిన్సిపల్‌తో చర్చిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు (ఇన్‌సెట్) గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న సరీనా(ఫైల్)

డక్కిలి: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డెంగీ కలకలం సృష్టించింది. పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని అడసనపల్లి సరీనా డెంగీ బారిన పడి చెన్నైలోని ఎగ్మూర్ చిన్న పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ఆరోగ్యం గురించి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి తరగతికి చెందిన విద్యార్థుల పర్యవేక్షణ బాధ్యత ఒక్కో ఉపాధ్యాయురాలికి అప్పగిస్తారు. వారు విద్యార్థుల ఆరోగ్యంతోపాటు బోధన, ప్రవర్తనను పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడి ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే విద్యార్థిని సరీనా పరిస్థితి. ఆ చిన్నారి జ్వరంతో బాధపడుతున్నా సిబ్బంది పట్టించుకోలేదు. 8వ తేదీన గుర్తించి తమ వద్ద ఉన్న మందులు ఇచ్చి సరిపెట్టారు. పరిస్థితి విషమించడంతో ప్రిన్సిపల్ శ్రీదేవి బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు 9వ తేదీన అక్కడికి చేరుకుని నెల్లూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు చెన్నై ఎగ్మూర్‌లోని చిన్న పిల్లల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

జవాబుదారీ తనం లేదు

డక్కిలి అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తీరుపై మార్పు సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి పవన్, ఎమార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంగళపూరి సురేష్, పల్లిపాటి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని సరీనాకు సకాలంలో వైద్యం అందించడంలో గురుకుల పాఠశాల సిబ్బంది విఫలమయ్యారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చిన్నారి వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

పర్యవేక్షిస్తున్నాం

చిన్నారి సరీనా ఆరోగ్య పరిస్థితిపై మా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 8వ తేదీన సరీనాకు జ్వరం వచ్చినట్లు గుర్తించాం. నర్సు, హౌస్ పేరెంట్స్‌ను పంపి ట్యాబ్లెట్ వేసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాం. 9వ తేదీన తల్లిదండ్రులు వచ్చి విద్యార్థినిని తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఆ విద్యార్థిని ఆరోగ్యం పట్ల వాకబు చేస్తూ.. పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



ధ్వజారోహణం అనంతరం హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట అర్చకులు అంకురార్పణతో పూజలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశస్థాపన పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద విశేష పూజలను నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణనడుమ ధ్వజారోహణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో ఈఓ ఎస్వీఎస్ఎన్.మూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి పురఉత్సవం జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయ అలంకార మండపంలో స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు.

ఆ ప్రాంతాల్లో శాశ్వత రోడ్లు నిర్మించండి

- ఎకో సెన్సిటివ్ జోన్ సమస్యలకు పరిష్కారం చూపండి
- కలెక్టర్‌కు వివరించిన ఎంపీ మద్దిల గురుమూర్తి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సమస్యలను వివరిస్తున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి అర్బన్: ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని సమస్యలకు పరిష్కారం చూపించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు విన్నవించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను ఎంపీ కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని ప్రజల జీవన విధానాన్ని వివరించారు. గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, చిట్టమూరు మండలాలు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ మండలం ఎకో సెన్సిటీవ్ జోన్ పరిధిలో ఉన్నాయన్నారు. వర్షాలప్పుడు ఆయా ప్రాంతాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో శాశ్వత రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు వెల్లడించారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన లక్ష్మీశ దృష్టికి సమస్యలు తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన ఒక కమిటీని ఏర్పాటు చేశారని..వారి సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన బదిలీపై వెళ్లారని, అనంతరం ఎన్నికల నిర్వహించడం తదితర పనుల్లో భాగంగా ఎకో సెన్సిటివ్ పనులకు బ్రేక్ పడిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కమిటీకి సూచనలు ఇవ్వడంతోపాటు ఆ ప్రాంతంలో శాశ్వత రోడ్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

తిరుమలలో విస్తృత తనిఖీలు



షాపులను తనిఖీ చేస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం, ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలను శుక్రవారం అధికారులతో కలిసి ఈఓ జే.శ్యామలరావు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా షాపుల లైసెన్స్‌లు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ వరండాలో సరుకులను నిల్వ ఉంచి, భక్తుల రాక పోకలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న దుకాణదారులు, షాపింగ్ కాంప్లెక్స్ చుట్టుపక్కల అనధికారిక తట్టలు, హాకర్లను హెచ్చరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ యాత్రికులు తిరిగేందుకు వీలు లేకుండా దుకాణదారులు సరుకులు ఉంచారని, అలా కాకుండా పరిశుభ్రతతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో యాత్రికులు షాపింగ్ చేసే విధంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. త్వరలో అనధికారిక తట్టలు, హాకర్ల లైసెన్సులను తనిఖీ చేసి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు గోకులంలోని సమావేశ మందిరంలో జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి టీటీడీ రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలపై ఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి విజయలక్ష్మి, ప్రత్యేక అధికారి మల్లికార్జున, ఏఈఓ చౌదరి పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై చర్యలకు టీటీడీ సిద్ధం

తిరుమల : తిరుమలలో శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఆకతాయిపై ఆరా తీయగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకొచ్చాయి. తమిళనాడుకు చెందిన యూట్యూబర్ వాసన్‌కి ప్రాంక్ వీడియోలు తీయడం అలవాటు. ప్రాంక్ పేరుతో పబ్లిక్‌ను ఇబ్బందులకు గురిచేస్తుంటాడు. గతంలో బైక్‌పై సాహసాల పేరుతో ప్రయత్నం చేయగా.. చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. దీనికి సంబంధించిన వీడియోపై హైకోర్టు సీరియస్ అయింది. అతని డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, అతని యూట్యూబ్ చానల్ మూసివేయాలని, అతనిపై కేసు కూడా నమోదు చేయాలని ఆదేశించింది.

భక్తుడిలా క్యూలోకి ప్రవేశించి..

శ్రీవారి దర్శనం కోసం మిత్రులతో కలిసి వాసన్ సర్వదర్శనం క్యూలోకి ప్రవేశించాడు. నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన కంపార్టుమెంట్ల వద్దకు టీటీడీ ఉద్యోగిలా వెళ్లాడు. కంపార్ట్‌మెంట్లో అప్పటికే గంటల తరబడి వేచి ఉన్న భక్తుల వద్దకు వెళ్లి కంపార్టుమెంట్ గేట్లు తెరుస్తున్నట్లు నటించాడు. భక్తులు కంపార్టుమెంట్ గేటు వద్దకు వచ్చారు. అంతే.. నవ్వుతూ అక్కడి నుంచి పరుగులు తీశాడు. ఇదే వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ప్రాంక్ వీడియోతో భక్తులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. వాసన్ వైఖరిని ఖండిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. ఇదిలా ఉండగా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తులు క్యూలో ప్రవేశించే సమయంలోనే వారి సెల్‌ఫోన్లను డిపాజిట్ చేసుకోవాలని టీటీడీ భావిస్తోంది. ఇప్పటివరకూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించే సమయంలో సెల్‌ఫోన్లు డిపాజిట్ చేస్తుండగా.. ఇకపై నూతన విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

క్లుప్తంగా

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో జూలై 18వ తేదీ నుంచి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా పురుషులు, మహిళలకు లైట్ మోటార్ వెహికల్ కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగులు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న పురుషులకు హాస్టల్ వసతిని సైతం అందించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ టీబీసీ వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 65,392 మంది స్వామివారిని దర్శించుకోగా 29,015 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గరుడ వాహనంపై అభయం

- ముగిసిన కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు రాత్రి గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 7 గంటల నుంచి గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరుడు

నేడు పార్వేట ఉత్సవం

సాక్షాత్కార వైభవోత్సవాలు ముగిసిన మరుసటి రోజైన శనివారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆస్థానం చేపడట్టనున్నారు. ఇందు కోసం ఇప్పటికే మండపాన్ని పూలు, విద్యుత్ దీపాలతో టీటీడీ అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- రేపు యూపీఎస్సీ పరీక్షలు
- తిరుపతిలో మూడు పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1,199 మంది అభ్యర్థులు

తిరుపతి అర్బన్ : తిరుపతిలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్ మురళీ ఆదేశించారు. ఆయన శుక్రవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం యూపీఎస్సీ(కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పోస్టులకు) పరీక్షలు జరగనున్నాయని, ఇందు కోసం తిరుపతిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 1,199 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్ ఏ, వింగ్ బీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏలో పరీక్షా కేంద్రాలు ఉంటాయని వెల్లడించారు. లైజన్ అధికారులుగా ముగ్గురు తహసీల్దార్లు, జిల్లా సమన్వయ అధికారిగా


కలెక్టరేట్‌లో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు

ఒకరిని, కస్టోడియన్‌గా తిరుపతి ఆర్డీవో నిషాంత్ రెడ్డిని నియమించినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదని వివరించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్షా కేంద్రాల వద్దకు బస్సులు నడపాలన్నారు.

18న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు (ఐవీసీ) పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందేందుకు ఈ నెల 18న తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, జిల్లా నోడల్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. అలాగే ఈ నెల 16వ తేదీలోపు సమీపంలోని ఏదేని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 18వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు.

15 నుంచి శిక్షణా తరగతులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఈ నెల 15 నుంచి మూడు రోజులు సంస్కృతంలో అవధాన సంగమం పేరుతో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు ఆదివారం లోపు కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

దర్గాగా భూ ఆక్రమణ

- రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకున్న రైతు

భాకరాపేట : అధికార మదంతో కొందరు టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. అడ్డదిడ్డంగా భూఆక్రమణలకు పాల్పడుతూ రైతులకు కన్నీళ్లు మిగుల్చుతున్నారు. ఇలాంటిదే భాకరాపేట మండలంలో చోటు చేసుకుంది. చిన్నగొట్టిగల్లు మండలం, చినిగేపల్లెకు చెందిన రైతు బాలిరెడ్డి చంద్రారెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సర్వే నం.542(2)లో తనకు 0.61 సెంట్ల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఆక్రమించేందుకు యత్నించగా.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై 2023 సెప్టెంబర్ 11న మదనపల్లె కోర్టు తనకు అనుకూలంగా తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. గురువారం అదే భూమికి సంబంధించి స్థానిక టీడీపీ నేతలు దౌర్జన్యంగా వచ్చి ట్రాక్టర్‌తో దుక్కిదున్నేందుకు యత్నించారని తెలిపారు. ఈ మేరకు తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సంబంధిత ఆక్రమణదారులకు కోర్టు ఆర్డర్ చూపి, దీన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించి వెళ్లారన్నారు. అయినా టీడీపీ నేతలు వినకుండా తనను బెదిరిస్తున్నారని తెలిపారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకున్నారు.


తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డు వద్ద వీఆర్‌ఏలు

సీఏ, సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఇంటర్, సీఎంఏ ఫౌండేషన్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ కళాశాల డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎం.వెంకట్‌యాదవ్ 402, ఎ.చరణ్‌సాయి 377, ఎం.దిలీప్ 365 మార్కులు సాధించారని, వీరితో పాటు 69.76శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అలాగే సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎం.రాధిక 312, ఎం.ప్రణవ్ 304, బి.లిఖిత్ 298, సి.సుశీలేంద్ర 292 మార్కులు సాధించారని, వీరితో పాటు 91.04 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.


విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్, అధ్యాపకులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ప్రమాదానికి కారణమైన లారీ


మృతి చెందిన రమాదేవి

భాకరాపేట: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన ఘటన భాకరాపేట ఘాట్ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. పుంగనూరు నియోజకవర్గం, రొంపిచెర్ల మండలం, గానుగచింత పంచాయతీ, చల్లంపల్లెకు చెందిన కీర్తికళ్యాణ్, రమాదేవి భార్యాభర్తలు. వీరికి లక్ష్మీశిర కుమార్తె ఉంది. ఉద్యోగరీత్యా రమాదేవి తిరుపతిలో నివాసముంటూ కుమార్తెను చదివించుకుంటోంది. భర్త కీర్తికళ్యాణ్ నెల్లూరులో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం తిరుపతి నుంచి కీర్తికళ్యాణ్, రమాదేవితో పాటు కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామం చల్లంపల్లెకు బయల్దేరారు. మార్గమధ్యం భాకరాపేట ఘాట్ రోడ్డులో ద్విచక్రవాహనం మొండికేయడంతో దాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద నడుచుకుంటూ వస్తున్న రమాదేవి (37)ని భాకరాపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఓ ప్రయివేటు కంపెనీకి చెందిన లారీ ఢీ కొట్టింది. చికిత్స నిమిత్తం ఆమెను భాకరాపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమాదేవి మృతిచెందింది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భాకరాపేట పోలీసులు తెలిపారు.

పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ..

- జాతీయ రహదారిపై ఆవు అడ్డంగా రావడంతో రోడ్డు ప్రమాదం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి, మరో ఇద్దరికి గాయాలు

చంద్రగిరి: ఆనందంగా పెళ్లి చూపులకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇంతలో జాతీయ రహదారిపై ఆవు అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. మదనపల్లి మండలం, రెడ్డివారిపల్లికి చెందిన బాలు(26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాలుకు తూర్పుగోదావరి జిల్లా, భీమవరం నుంచి వివాహ సంబంధం రావడంతో పెళ్లి చూపుల కోసం తన తమ్ముడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌తో కలసి బుధవారం రాత్రి బెంగళూరు నుంచి భీమవరానికి కారులో వెళ్లారు. గురువారం ఉదయం పెళ్లిచూపులు ముగించుకుని మధ్యాహ్నం అక్కడ నుంచి కారులో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున ఎం.కొంగరవారిపల్లి వద్ద వెళ్తున్న క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఆవు రావడంతో వాహనం నడుపుతున్న దిలీప్ ఆవును తప్పించేందుకు యత్నించాడు. దీంతో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలు తలకు తీవ్ర గాయం కాగా, శంకరమ్మ, దిలీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించింది. బాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. అనంతరం పోలీసులు బాలు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. పెళ్లిచూపులకు వెళ్లి తిరిగి వస్తూ కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు రోదనలు చూపరులను కలచివేశాయి. ఈ మేరకు సీఐ రామయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామయ్య


మృతి చెందిన బాలు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

– ఇద్దరి మృతి

రామచంద్రాపురం: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని నెత్తకుప్పం– రాయలచెరువుకట్ట ప్రధాన రోడ్డు మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని నెమళ్లగుంట్లపల్లికి చెందిన బోడిరెడ్డి చెంగారెడ్డి శనేశ్వరాలయంలో పూజ నిమిత్తం తన సమీప బంధువు గోవర్ధన్ ద్విచక్ర వాహనంపై పచ్చికాపల్లం వెళ్లాడు. అక్కడ పూజాసామగ్రి కొనుగోలు చేసి స్వగ్రామానికి బయలుదేరాడు. వేణుగోపాలపురం సమీపంలో వెళుతుండగా అదే సమయంలో నెత్తకుప్పం నుంచి ద్విచక్ర వాహనంపై తిమ్మరాజుపల్లి వైపు వస్తున్న దేవరాజులు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోవర్ధన్ వెనుకవైపు కూర్చున్న చెంగారెడ్డి (46), దేవరాజులు వెనుక వైపు కూర్చున్న భరత్ (36)కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో చెంగారెడ్డిని తిరుపతి రుయాకు తరలించగా వైద్యులు అతనిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భరత్‌ను ఎస్ఆర్ కమ్మపల్లి గ్రామం నుంచి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెంగారెడ్డి కాలుకు తీవ్ర గాయం


మృతుడు చెంగారెడ్డి (ఫైల్)

ఎవరీ బాలుడు?

రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన గుర్తుతెలియని బాలుడిని ప్రయాణికులు జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం మూడో నంబర్ ప్లాట్ ఫాంపై నాలుగేళ్ల వయస్సు కలిగిన బాలుడు ఏడుస్తూ తిరుగుతుండడాన్ని ప్రయాణికులు గుర్తించి ఆరా తీశారు. అయితే బాలుడు ఏమీ చెప్పలేకపోవడంతో స్టేషన్ ఆవరణలో ఉన్న జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. బాలుడి కుటుంబీకులెవరైనా ఉంటే జీఆర్‌పీ ఎస్ఐ రవి (9963126343) నంబరును సంప్రదించాలన్నారు.


తప్పిపోయిన బాలుడు

రైలు కిందపడి వృద్ధుడి మృతి

చంద్రగిరి: రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగి, నలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కా వేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు కింద పడడంతో రెండు కాళ్లు తెగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి చొక్కా వెనుక కాలర్ వద్ద చరణ్‌తేజ్ టైలర్, జీవకోన, తిరుపతి అని ఉంది. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చిత్తూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

ఏర్పేడు: మండలంలోని ఓ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలానికి చెందిన బలరామయ్య ఈ నెల 7న ఓ గ్రామానికి చెందిన ఓ బాలికకు చాక్లెట్స్ ఇచ్చి ఇంట్లోకి తీసుకుని వెళ్లి అత్యాచారం చేసినట్లు వివరించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శోకసంద్రం

- ప్రమాదంలో ముగ్గురు వలస కూలీల మృతి
- మృతదేహాలను బంధువులకు అప్పగించిన పోలీసులు
- తల్లిదండ్రుల రోదనలతో దద్దరిల్లిన ఏరియా ఆస్పత్రి

బుచ్చినాయుడుకండ్రిగ: 'కూలి పనుల కోసం వచ్చి కడతేరిపోయారా నాయనా..? బిడ్డలు చేతికొచ్చారని సంబరపడ్డాము. ఇక మాకు దిగులుండదని సంతోషించాము. కానీ ఆ దేవుడు మిమ్మల్ని దక్కకుండా చేశాడు. ఇక మేము ఎవరికోసం బతకాలి దేవుడా..?' అంటూ వలసకూలీల బంధువుల రోదనలతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి దద్దరిల్లింది. మండలంలోని శ్రీకాళహస్తి–తడ మార్గంలోని పార్లపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులు మృతిచెందిన విషయం తెల్సిందే. శుక్రవారం మృత దేహాలను అంబులెన్స్‌లో ఒడిశా రాష్ట్రంలోని వారి స్వస్థలాలకు తరలించినట్టు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో యువకుల మృతదేహాలు బాపూన్‌సింగ్ (22), రాజాసింగ్ (22), సుఖ్‌దేవ్‌సింగ్ (22)కు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా.. తల్లిదండ్రులు వారిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కలచివేసింది.


మృతదేహాలను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసు సిబ్బంది

డిగ్రీ కౌన్సెలింగ్ షెడ్యూల్ గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: టీటీడీ, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ గడువును ప్రభుత్వం పొడిగించింది. ప్రస్తుతం ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎమ్‌డీసీ) వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తున్నారు. ఈ గడువు 10వ తేదీతో ముగిసింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 23వ తేదీ నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. 27 నుంచి వెబ్ ఆప్షన్ల మార్పునకు వెసులుబాటు కల్పించి, ఈ నెల 31న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

ఫ్యాషన్ 'షో'


అదిరేటి డ్రస్సు మేమేస్తే..!

తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షో అలరించింది. ఒకేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినులు తమ ఫైనల్ ఇయర్ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా వారు డిజైన్ చేసిన మోడల్ వస్త్రాలను ధరించి ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్‌చేసి ఆకట్టుకున్నారు. తిరుపతికి చెందిన ఆర్కిడ్ హోటల్, వరగానీ స్టూడియోస్, బ్లెస్డ్ డిజైనర్ స్టూడియోస్, లేఖ పింక్ పాలెట్ ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల డిజైన్ నైపుణ్యాన్ని, అధ్యాపకులు, వర్సిటీ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. తాము ఎంచుకున్న రంగంలో విద్యార్థినులు రాణించాలని వర్సిటీ వీసీ డీ.భారతి ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ రజిని, హోమ్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బిందు, దేవి హబీబ్ పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ





